క్లుప్తంగా

మహిళల ఆర్థిక అభివృద్ధే జగనన్న లక్ష్యం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గిరిజాకుమారి, మహిళా సంఘాల సభ్యులు

ఉప్పలగుప్తం: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని సన్నవిల్లి, నంగవరం గ్రామాల ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత లబ్ధి చేకూర్చిన సందర్భంగా ఆదివారం సన్నవిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలతో కలిసి ఆమె ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గ్రామంలో 51 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.35.21 లక్షల లబ్ధి చేకూరిందని ఆమె తెలిపారు.

కొత్తలంకలో ఉచిత వైద్య శిబిరం

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం కొత్తలంక వివేక సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమలాపురం ఏఎస్ఎన్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు అయ్యగారి పవన్ శేఖర్, మంజుల అన్నపూర్ణలు 140 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పన్నుల వసూళ్లలో అమలాపురం ప్రథమం

అమలాపురం టౌన్: పన్నుల వసూళ్లలో అమలాపురం మున్సిపాలిటీ జిల్లాలోనే ప్రథమంగా నిలిచిందని కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నులపై ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకుంటూ 95.80 శాతం మేర పన్నులు వసూలు చేసి జిల్లాలోనే ప్రథమంగా నిలిచేలా చేశారని కమిషనర్ నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ రెవెన్యూ అధికారి శిరిగినీడి శివాజీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పల్లి వెంకటేశ్వరరావు, కుడుపూడి రవిశంకర్, రెవెన్యూ విభాగ సిబ్బందిని కమిషనర్ నాయుడు అభినందించారు.

ఆ ముగ్గురికీ అభినందనలు

అమలాపురం టౌన్: ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, రాష్ట్ర హార్టీకల్చర్ బోర్డు మెంబర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్‌లను స్థానిక కౌండిన్య నగర్ శ్రీరామమందిర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మట్టపర్తి మురళీకృష్ణ, కుడుపూడి సుబ్బారావు, యార్లగడ్డ రవీంద్ర, గుత్తుల సుబ్రహ్మణ్యం, చిట్టూరి పెదబాబు తదితరులు వారిని అభినందించారు.

మత్తులో చిత్తవుతున్న యువత

- యానాంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- కళాశాలల విద్యార్థులే లక్ష్యంగా అమ్మకాలు
- నిఘా పెంచాలని కోరుతున్న ప్రజలు



గంజాయి తాగుతున్న యువకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

యానాం: ప్రతి మనిషి జీవితానికి విద్యార్థి దశ తొలిపొద్దు లాంటిది. ఆ పసి మనసులో పడే ముద్రలే భవితకు బంగారు బాటలు వేస్తాయి. వారు మంచి పౌరులుగా ఎదగాలంటే మొక్క దశలోనే వారిని తీర్చిదిద్దాలి. కర్తవ్యంతో పెంచాలి. కాని యానాం నియోజకవర్గంలో కొందరి కాసుల కక్కుర్తి యువతను గంజాయికి బానిసలుగా మార్చేస్తుంది. కళాశాలల విద్యార్థులే లక్ష్యంగా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయని పోలీసుల నిఘాలో బహిర్గతం కావడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గంజాయి చాప కింద నీరులా వ్యాపిస్తుండడంతో పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ పిల్లల భవిష్యత్ ఏంటని తల్లిదండ్రులు భయపడిపోతున్నారు.

ఏజెన్సీ ప్రాంతాల నుంచి స్మగ్లింగ్

ప్రశాంతమైన వాతావరణానికి, పర్యాటకానికి నెలవైన యానాంలో ఇటీవల గంజాయి స్మగ్లింగ్ చేస్తూ దొరుకుతున్న ఘటనలు ఎక్కువవ్వడంపై స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. భౌగోళికంగా తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న యానాంకు ఏజెన్సీ ప్రాంతాలైన అరకు, నర్సీపట్నం, విశాఖపట్టణం తదితర ప్రాంతాల నుంచి గంజాయి ప్యాకెట్లు రవాణా అవుతున్నాయి. ముఖ్యంగా యానాం సరిహద్దుల్లో ఎటువంటి తనిఖీలు లేకపోవడంతో ఈ తతంగమంతా సాఫీగా సాగిపోతుంది. ఏడాది కాలంగా యానాం పరిధిలో 10 గంజాయి కేసులు నమోదైనట్లు పోలీసులు ధ్రువీకరిస్తున్నారు. గత నెల 27వ తేదీన యానాం ఎదుర్లంక వంతెన వద్ద స్థానిక కనకాలపేట, అంబేడ్కర్ నగర్‌లకు చెందిన ఇద్దరు యువకులతో పాటు విశాఖపట్టణానికి చెందిన మరో యువకుడిని గంజాయితో అరెస్ట్ చేశారు. ఐదు నెలల క్రితం భువనేశ్వర్-పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్‌లో భారీగా గంజాయిని తరలిస్తున్న యానాం యువకుడిని పుదుచ్చేరి పోలీసులు పట్టుకున్నారు. స్థానికంగా కేజీ రూ.10 వేలు నుంచి 15 వేలకు లభిస్తుండగా పుదుచ్చేరిలో మాత్రం కేజీ రూ.లక్ష వరకు పలుకుతుండటంతో అక్కడికి ఎక్కువగా రవాణా చేస్తున్నారని భావిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో అయ్యన్నగర్, సావిత్రినగర్, కనకాలపేట, దరియాలతిప్ప, కొత్తపేట, కురసాంపేట, ఫ్రాన్స్‌తిప్ప తదితర ప్రాంతాల్లో రాత్రయితే చాలు గంజాయి వాసన గుప్పుమంటుందని స్థానికుల నుంచి తెలుస్తుంది. యానాంలో సుమారు 200 మంది వరకు విద్యార్థులు గంజాయికి అలవాటు పడ్డారని ఒక స్వచ్ఛంద సంస్థ అంచనా వేస్తుంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ ఉండడం మంచిదని సామాజికవేత్తలు సూచిస్తున్నారు.

మైనర్‌లను వదిలేస్తున్నారనే ఆరోపణలు

స్థానికంగా పలువురు యువకులు ముందుగా బైక్‌లను దొంగిలించి వాటిని ఏజెన్సీ ప్రాంతాల్లో విక్రయించి వచ్చిన సొమ్మును గంజాయి కొనుగోలుకు వినియోగిస్తున్నారని తెలుస్తుంది. గంజాయి కేసుల్లో ఎక్కువగా మైనర్‌లు దొరుకుతున్నారని దీంతో పోలీసులు వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మైనర్‌లపై కేసులు నమోదుచేస్తే వారిని రాజమండ్రి జువైనల్ కోర్టుకు తీసుకెళ్లడం ప్రయాసతో కూడిన పనవ్వడంతో పాటు ఖర్చుతో కూడుకున్నదన్న ఉద్దేశంతో వారిని వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. యానాంలో అర్ధరాత్రి ఒంటిగంట దాటుతున్నా యువకులు రోడ్లపై ఉంటున్నారని, అలాంటివారిని అదుపు చేయాల్సిన అవసరముందని స్థానికులు చెబుతున్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సులు నిర్వహించాలని, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా కొనసాగుతోంది



గంజాయి మహమ్మారిని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నాం. నియోజకవర్గ పరిధిలో ఏ ప్రాంతంలో గంజాయి దొరికినా నిందితులను అరెస్ట్ చేస్తున్నాం. గంజాయిని అరికట్టడానికి ప్రత్యేక నిఘా కొనసాగుతుంది.

– శేరు నూకరాజు, ఎస్ఐ, యానాం

కఠిన చర్యలు తీసుకోవాలి



గంజాయి మహమ్మారి పట్టణ ప్రాంతాలనుంచి గ్రామాలకు సైతం పాకడంతో యువత పక్కదోవ పడుతోంది. మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పోలీసులు నిఘా పెంచి గంజాయి రవాణా కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

– సబ్బతి శ్రీనివాసరావు, గ్రామపెద్ద, దరియాలతిప్ప

రూ.5 లక్షల విరాళం



ధ్యాన మందిర నిర్మాణానికి విరాళం అందజేస్తున్న తాతాజీ కుటుంబ సభ్యులు

అమలాపురం టౌన్: అమలాపురం ఓం శాంతి కేంద్రం ఆధ్వర్యంలో దాదాపు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న ఓంశాంతి ధ్యాన మందిరానికి అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ కుటుంబం రూ.5 లక్షలు విరాళంగా సమకూర్చింది. ఈ మొత్తాన్ని ఓ శాంతి కేంద్ర భవనంలో ఇన్‌చార్జి బ్రహ్మకుమారి శ్రీదేవికి తాతాజీ కుటుంబ సభ్యులంతా కలిసి ఆదివారం అందజేశారు.

ఆర్‌సీఎం చర్చిలో రక్తదాన శిబిరం

యానాం: మట్టల ఆదివారం పండగను పురస్కరించుకుని స్థానిక చారిత్రక రోమన్ కేథలిక్ చర్చిలో కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ పి.మరియదాసు పర్యవేక్షణలో 51 మంది భక్తులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కామరాజు, చర్చి పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

గాడిమొగలో ఉచిత వైద్య శిబిరం

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీలోని స్థానిక రిలయన్స్ కమ్యూనిటీ హాలులో సూర్య మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఎం.సురేష్ బాబు, ధర్మేంద్ర, గంగాధర్, మణికంఠస్వామిలు సుమారు 100 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అధినేత మచ్చా గంగాధర్‌రావు, గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఉప్పలగుప్తం: నేటి నుంచి జరిగే పది పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం చేశామని మండల విద్యాశాఖాధికారి కె.కిరణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా ఉన్న 7 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 599 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారన్నారు. ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభమై 12:45 నిమిషాల వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ముందుగానే హాజరవ్వాలన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు ఎటువంటి స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్, బ్యాటరీ పరికరాలు తీసుకురాకూడదని తెలిపారు.

పరీక్షలకు 588 మంది విద్యార్థులు

కాట్రేనికోన: మండలంలో కందికుప్ప, కాట్రేనికోన, చెయ్యేరు పరీక్షా కేంద్రాల్లో 588 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని ఎంఈఓ బి.రమణశ్రీ అన్నారు. పరీక్షా కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి గదిలో 4 ఫ్యానులు, 4 ట్యూబ్ లైట్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

భైరవస్వాముల వార్షికారాధన మహోత్సవాలు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ బొడ్డు చినవెంకటాయపాలెంలో అచలఋషి నిర్మలాశ్రమంలో ఆదివారం బొడ్డు భైరవస్వాముల 35వ వార్షికారాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. తొలిరోజు విషయ నిర్ణయ సభ, భైరవస్వామి, నాగమాంబ విగ్రహ ప్రతిష్ఠ, రెండో రోజు వేదాంత వైజ్ఞానిక మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, మాజీ మంత్రి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లాడి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, వనమాడి కొండబాబు తదితరులు హాజరయ్యారు.

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల పాత్ర కీలకం

- సంక్షేమ ఫలాల సమాచారాన్ని ఇంటింటికీ చేర్చాలి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్, చిత్రంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక సర్ ఆర్థర్ కాటన్ అతిథి గృహంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన ఆదివారం జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి వారం రోజుల పాటు జరిగే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్ర స్థాయిలో సచివాలయ పార్టీ కన్వీనర్లు, గృహ సారథులు సంక్షేమ ఫలాల సమాచారాన్ని ఇంటింటికీ చేరవేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని అందుకుంటున్న డ్వాక్రా మహిళలు, పెన్షనర్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ పట్టణంలోని 30 వార్డుల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుతున్న లబ్ధిని వివరిస్తే పార్టీ విజయకేతనం ఖాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల అధ్యక్షుడు ఈతకోట శ్రావణ్‌కుమార్, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి, పార్టీ నాయకులు కుడుపూడి భరత్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు మంత్రి పరామర్శ



బాధితులకు దుస్తులు, నగదు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్ తదితరులు

అమలాపురం రూరల్: మండలంలోని బండార్లంక శివారు పేరివారి కాలనీలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఎనిమిది చేనేత కుటుంబాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామ వైఎస్సార్ సీపీ కమిటీ సమకూర్చిన నూతన దుస్తులు, రూ.80 వేల నగదు మంత్రి, ఎమ్మెల్సీ చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ప్రభుత్వం తరపున బాధితులను ఆదుకుంటామని మంత్రి విశ్వరూప్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జిల్లా వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, ఎంపీటీసీ సభ్యులు అంకం హిమభారతి తదితరులు పాల్గొన్నారు.

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఆరోగ్య సదస్సులో మాట్లాడుతున్న ఆర్మ్‌డ్ రిజర్వుడు డీఎస్పీ విజయసారథి

అమలాపురం టౌన్: నడకతోనే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం సాకారమవుతుందని స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయం ఆర్మ్‌డ్ రిజర్వుడు డీఎస్పీ పి.విజయసారథి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో 'నడకే మహాభాగ్యం-నడకే ఆరోగ్యం' అనే అంశంపై ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డీఎస్పీ విజయసారథి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదస్సులో డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి మాట్లాడుతూ ఆరోగ్య చిట్కాలను, నడక ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు, విశ్రాంత ఉపాధ్యాయుడు నాగా జనార్దనరావు, వాకర్స్ హెల్త్ క్లబ్ పుత్సా కృష్ణ కామేశ్వర్, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.రాజేశ్వరి, క్లబ్ కో ఆర్డినేటర్ పచ్చిగోళ్ల శ్రీనివాసరావు, వాకర్స్ గవర్నర్ ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల కన్వీనర్ల నియామకం

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన వద్ద రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్పీఐ) జిల్లా పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పార్టీ కన్వీనర్లను నియమించారు. అమలాపురం నియోజకవర్గ కన్వీనర్‌గా పరమట నాగరాజు, ముమ్మిడివరం నియోజకవర్గ కన్వీనర్‌గా పంతగండి నరసింహరావు, పి.గన్నవరం, రాజోలు కన్వీనర్‌గా నేలపూడి రామకృష్ణలను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్ఞాన ప్రకాష్ తెలిపారు. అమలాపురం రూరల్ మండలం సాకుర్రులో ఆర్పీఐ మాజీ జాతీయ కార్యదర్శి పాలమూరి బాలకృష్ణ జయంతి సందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.









ఎమ్మెల్యే పొన్నాడకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రమేష్ తదితరులు

తాళ్లరేవు: ఇటీవల నూతనంగా ఎన్నికైన మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాళ్లరేవులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంపై మొదటి అంతస్తు నిర్మాణానికి సుమారు రూ.40 లక్షలు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే పొన్నాడకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్ పుష్పగుచ్ఛం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తమకు విద్య నేర్పిన గురువులతో 1990-91 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

అల్లవరం: అల్లవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1990-91 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకుంటూ చిన్ననాటి విశేషాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులు మూల శర్మ, సాయిబాబు, అజీజ్, నూకల కామేశ్వరరావు, వీఎల్ఎస్ఎన్, ఆచార్యులు, భీమరాజు, బలరామరాజు, భమిడిపాటి వెంకటశాస్త్రిలను డాక్టర్ బసవా వరహాలు చేతుల మీదుగా సత్కరించుకున్నారు. కార్యక్రమంలో దొమ్మేటి బాలకృష్ణ, దూనబోయిన నాగ సుబ్రహ్మణ్యం, హెచ్ఎం ఎస్.వెంకటేశ్వరరావు, కడలి సతీష్, పద్మజ, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం కావాలి

యానాం: పాఠశాలల్లో ఉపాధ్యాయులందరూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ పేర్కొన్నారు. ఆదివారం గోపాల్‌నగర్‌లో వేద పబ్లిక్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థికి పాఠ్యాంశాలు అర్థమయ్యేలా అనువైన బోధనా పద్ధతుల ద్వారా బోధించడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించవచ్చన్నారు. అధ్యాపకుడు బొల్లోజు బాబా మాట్లాడుతూ ప్రపంచం విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కరిక్యులమ్‌లో సైతం మార్పులు తేవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనుమ, గూటం శివగణేష్, వీహెచ్ రామకృష్ణ, వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

యానాం బీజేపీ అధ్యక్షుడిగా వెంకటస్వామి

యానాం: యానాం నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడిగా కనకాల వెంకటస్వామి(రాజు) నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం పుదుచ్చేరి బీజేపీ కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. హోంమంత్రి నమశ్శివాయం ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఎమ్మెల్యేలు శివశంకర్, రిచర్డ్ జాన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ

అమలాపురం రూరల్: బండారులంకలో అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బాధితులకు మాతా రమాబాయి అంబేడ్కర్ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు పుణ్యమంతుల రజనీ చేతుల మీదుగా నిత్యావసర సరకులు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ను కలిసిన వీఆర్‌ఓలు



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీఆర్‌ఓలు

అల్లవరం: ఎమ్మెల్సీగా విజయం సాధించి తొలిసారిగా స్వగ్రామం గోడి విచ్చేసిన ఇజ్రాయిల్‌ను బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మాదిగ ఎంప్లాయిస్ యూనియన్ వీఆర్‌ఓలు ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.అశోక్‌ప్రసాద్, ఈవీవీ సత్యనారాయణ, ఎల్‌కే శ్రీనివాస్, దొండపాటి అమ్మాజీ, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

కాట్రేనికోన: కాట్రేనికోన వంతెన నుంచి శ్మశాన వాటికకు గ్రావెల్ రోడ్డు వేయించిన సర్పంచ్ గంటి వెంకట సుధాకర్‌ను శెట్టిబలిజ సామాజిక వర్గం ఆదివారం ఘనంగా సన్మానించింది. గ్రామ ప్రజల సౌకర్యార్థం శ్మశాన వాటిక అభివృద్ధిలో భాగంగా రోడ్డు పనులు చేపట్టడంతో హర్షం వ్యక్తం చేశారు. గణేష్ శెట్టిబలిజ యువజన సంఘం అధ్యక్షుడు కొప్పిశెట్టి ఆనందరావు మాస్టారు ఆధ్వర్యంలో సర్పంచ్ వెంకట సుధాకర్‌ను దుశ్శాలువాతో సత్కరించారు.

జలసంరక్షణ అలవరచుకోవాలి

యానాం: విద్యార్థి దశ నుంచే జల సంరక్షణ అలవరచుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర పర్యావరణ కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక దరియాలతిప్ప కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్‌లో నీటి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మశ్రీ, యానాం శాఖ ఉపాధ్యక్షుడు కాశి జానకిరాముడు, ఉపాధ్యాయులు మహేష్, తిరుకోటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



